సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 24 । జనవరి । 2023



రేపటి నుంచి సీఎం కప్ క్రీడా ఎంపికలు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25, 27, 28 తేదీల్లో ఏపీ సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు స్టెప్ సీఈఓ తెలిపారు. - 8లో



ఆంగ్లభాషలో నైపుణ్యం ఎంతో అవసరం

నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషలో నైపుణ్యం ఎంతో అవసరం అని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.3 /17.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 17.0 - 30.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

3న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10.00 గంటలకు కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, వైద్యం, పశుసంవర్ధక, గృహ నిర్మాణ, ఐసీడీఎస్, విద్య, డ్వామా, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, విద్యుత్, రహదారులు, ప్రణాళిక, పరిశ్రమలు, నీటిపారుదల, ఆర్టీసీ, పౌరసరఫరాలు, సంక్షేమశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందన్నారు. అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు.

29న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాయంత్రం 5.00 గంటలకు 116వ సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విశాఖపట్టణం విశ్రాంత రసాయనశాస్త్ర ఆధ్యాపకులు ఆచార్య కొత్తపల్లి గంగాధరవేణు తాను రాసిన నాటకాలపై ప్రసంగించనున్నట్లు వివరించారు.

27న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీ డ్యాప్ వారి సంయుక్తాధ్వర్యంలో ఈనెల 27వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈ జాబ్ మేళాకు హెచ్‌సీఎల్ కంపెనీ వారు ఐటీ సాఫ్ట్‌వేర్ అసోసియేట్, ఎల్ఐసీ కంపెనీవారు ఆర్‌సీఏ, సీసీఏ ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళ, పురుష అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు వివరాలను తొలుత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90636 23706, 99080 51624 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తుకు వివిధ వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున దాసరి ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ విడత శిక్షణకు ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ , కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్, పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు.


టీడీపీలో ముదిరిన విభేదాలు

– వేర్వేరుగా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు

వేంపల్లె : తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. సోమవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు వేంపల్లెలోని వేర్వేరు కార్యాలయాల్లో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించి మండల కన్వీనర్ రామమునిరెడ్డి టీడీపీ కార్యాలయం ఏర్పాటు చేయగా.. ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ మరో కార్యాలయంలో జరిపారు. నారా లోకేష్ జన్మదిన వేడుకలు వేర్వేరు చోట్ల జరుపుకోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

- చురుగ్గా కొనసాగుతున్న విద్యుద్దీకరణ పనులు
- జిల్లాలోని 240 కాలనీల్లో ఇప్పటికే పనులు పూర్తి
- మరో 130 కాలనీల్లో తుది దశలో పనులు
- ఇప్పటికే రూ.20 కోట్లు ఖర్చు చేసిన విద్యుత్‌శాఖ
- మరో రూ. 40 కోట్ల పనుల నిర్వహణకు ప్రణాళికలు
- 350 ఇళ్లకు కరెంటు కనెక్షన్లు అందించిన అధికారులు
- ప్రత్యేక మేళాలు నిర్వహించి లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్న అధికారులు
- విద్యుత్ మీటర్లు, వైరు, బోర్డు, ఎంసీబీ ల్యాంప్, హోల్డర్లు సైతం ఉచితంగా అందజేత

జగనన్న కాలనీల్లో విద్యుత్ మీటర్లు అమర్చుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది



జగనన్న కాలనీల్లో

విద్యుత్ వెలుగులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నిర్మించిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన శర వేగంగా జరుగుతోంది. ఇందులో అత్యంత ముఖ్యమైన విద్యుద్దీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. జిల్లాలో 440 జగనన్న కాలనీలు ఉండగా 240 కాలనీల్లో విద్యుత్ స్తంభాలు నాటి, లైన్లు లాగి, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి విద్యుత్ కనెక్షన్లకు అనువుగా మార్చారు. మరో 130 కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు సాగుతున్నాయి. ఈ పనుల కోసం విద్యుత్ శాఖ ఇప్పటి వరకూ రూ.20కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.40కోట్ల పనులు చేయాల్సి ఉంది. ఆయా కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని వైరింగ్ పూర్తి చేసుకున్న వారికి రూపాయి కూడా కట్టనవసరం లేకుండానే విద్యుత్ మీటర్లు, వైరు, బోర్డు, ఎంసీబీ ల్యాంప్, హోల్డర్లను ఉచితంగా అందజేస్తున్నారు. జిల్లాలో సుమారు 350 ఇళ్లకు కరెంటు కనెక్షన్లు ఇచ్చారు. ఏఈల వద్ద మరో 5080 మీటర్లు, బోర్డులు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో జగనన్న కాలనీల్లో 1.80లక్షల ఇంటి స్థలాలు ఇవ్వగా 68వేల ఇంటి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 2600 ఇళ్లు రూఫ్ లెవెల్‌కు రాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. కడప నగరంలో మామిళ్లపల్లె, వైఎస్సార్ కాలనీ, టిడ్కో-1, టిడ్కో-2 లే అవుట్లలో ప్రత్యేక మేళాలు నిర్వహించి లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లు అమర్చారు.



జగనన్న కాలనీల్లో ఓ ఇంటికి అమర్చిన విద్యుత్ మీటర్

పదివేల మీటర్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం



జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుంటే పదివేల మీటర్లు ఇచ్చేందుకు విద్యుత్ శాఖ సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఏఈల వద్ద ఐదువేలకుపైగా బోర్డులు, మీటర్లు ఉన్నాయి. వైరింగ్ పూర్తయిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే చాలు వైరు, బోర్డు, మీటర్, ఎంసీబీ ల్యాంప్, హోల్డర్ ఉచితంగా ఇస్తాం. ఈ అవకాశాన్ని హౌసింగ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్. మునిశంకరయ్య, పర్యవేక్షక ఇంజినీరు, ఏపీఎస్‌పీడీసీఎల్, కడప సర్కిల్.

హెల్మెట్ భారం కాదు.. భరోసా

కడప అర్బన్ : ఈ చిత్రంలో బుల్లెట్ బైకు నడుపుతున్న వ్యక్తి ఏ ఎస్ఐనో లేక మరో అధికారో కాదు.. వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్. హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో పోలీసులు నిర్వహించిన మోటార్ సైకిళ్ల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా ఆయన హెల్మెట్ ధరించి మోటార్ బైకు నడుపుతూ అందరిలో ఉత్సాహం నింపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ భారం కాదని, అది జీవితానికి భరోసా అని చెప్పారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. డ్రైవింగ్‌లో సెల్ ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలన్నారు. అందరూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు.



ఈ క్రమంలో హెల్మెట్ ధరించాలని సూచిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. డి.టి.సి మీరా ప్రసాద్, కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, ఎస్‌బీ సీఐ రాజాప్రభాకర్, కడప నగరంలోని సీఐలు ఎన్.వి నాగరాజు, సయ్యద్ హాసం, శ్రీరామ్ శ్రీనివాసులు, కడప ట్రాఫిక్ సీఐ సీతా రామిరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ ప్రగతికి కృషి

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య పి. ఫజుల్ రెహమాన్

ఏఎఫ్‌యూ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషిచేస్తానని వైస్ చాన్సలర్ ఆచార్య పి. ఫజుల్ రెహమాన్ పేర్కొన్నారు. పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఈయన ఈనెల 11న ఏపీ ఉన్నతవిద్యామండలిలో చార్జి తీసుకున్నప్పటికీ లాంఛనంగా సోమవారం విశ్వవిద్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించానన్నారు. విశ్వవిద్యాలయం భూమి కేటాయింపులు, నిర్మాణపనులు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అదే విధంగా విద్యార్థుల కోసం ప్లేస్‌మెంట్ సెల్ ఏజెన్సీలతో కలిసి జాబ్‌మేళాలు, విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాల కోసం ప్రతిష్టాత్మక సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకునేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య పఠాన్ ఫజుల్ రెహమాన్‌ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కర్నూలు డాక్టర్ అబ్దుల్ హక్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాస్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపి వీసీ దంపతులను సత్కరించారు.



వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న రిజిస్ట్రార్ తదితరులు

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో జేసీ సాయికాంత్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఇన్‌చార్జి డీఆర్వో రామ్మోహన్‌తో కలిసి జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలన్నారు. లక్ష్యం మేరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జేసీ సాయికాంత్‌వర్మ, ఇన్‌ఛార్జి డీఆర్వో మోహన్‌రావు, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, చంద్రమోహన్ తదితరులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

26న వంద అడుగుల జాతీయ పతాకం ఆవిష్కరణ

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున ఉన్న పుట్టపర్తి సర్కిల్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన వంద అడుగుల ఎత్తులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా వంద అడుగుల స్థూపం లేదన్నారు. రూ.15లక్షల వ్యయంతో వంద అడుగుల స్థూపానికి 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో ప్రత్యేకంగా తయారు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తామన్నారు. 365 రోజులు జాతీయ పతాకం పట్టణ నడిబొడ్డున రెపరెపలాడుతుంటుందన్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఎల్ఈడీ రోప్ లైట్స్‌ను పట్టణంలో 25న రాత్రి వెలిగిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు ఈ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు అభినందించారు.

సూర్య, శేష వాహనాలపై దేవదేవుడు



గ్రామోత్సవంలో పెద్ద శేష వాహనంపై స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి పెద్ద శేష వాహనంపై కొలువుదీరారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహించగా, సాయంత్రం ఊంజల సేవ చేశారు. నాదస్వర విన్యాసాల మధ్య కళాకారుల భక్తికీర్తనలతో ఊంజల సేవ ఉల్లాసంగా సాగింది. ఉదయం అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి సూర్యనారాయణమూర్తి అలంకారంలో గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. రాత్రి కనుల పండుగా అలంకరించిన పెద్ద శేషవాహనంపై భక్తుల జయజయధ్వానాల మధ్య మాడవీధుల్లో దర్శనమిచ్చారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో టీటీడీ కళాకారుల అన్నమాచార్య కీర్తనలు, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథగానం భక్తులను అలరించింది.

రైతులకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ వరం
- వాటర్ షెడ్ డైరెక్టర్ వెంకటరామమునిరెడ్డి



రైతు శివశంకర్‌కు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వాటర్‌షెడ్ డైరెక్టర్

మైదుకూరు : పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు చిత్తశుద్ధితో రైతులకు మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు వేసుకున్న రైతు నంద్యాలంపేటకు చెందిన శివశంకర్‌కు సోమవారం వాటర్ షెడ్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ పి.వెంకటరామమునిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మోటారు పంపు సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రైతు శివశంకర్ పొలంలో వేసిన బోరుకు బిగించిన పంపుసెట్‌కు ఎమ్మెల్యే, అధికారులు పూజలు నిర్వహించి స్టార్టర్ స్విచ్ ఆన్ చేసి రైతు పొలంలోకి నీటిని పారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో భూగర్భజలాలు అడుగంటి పంటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి రెండు, మూడు బోర్లు వేశారన్నారు. అయినా నీరు పడక పంటలు ఎండిపోయాయని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల దుస్థితిని చూసి చలించి ప్రభుత్వమే ఉచితంగా రైతులకు బోర్లు వేయిస్తుందని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు వైఎస్సార్ జలకళ పేరుతో పథకాన్ని నవరత్నాలులో చేర్చారన్నారు. వైఎస్సార్ జలకళ కింద జిల్లాలో 18,265 బోర్లు వేయించారని తెలిపారు. ఇందులో 12,140 మంది సన్న చిన్నకారు రైతులున్నట్లు పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 179 మంది రైతులకు బోర్లు వేశారని తెలిపారు.

వాటర్ షెడ్ రాష్ట్ర డైరెక్టర్ పి.వెంకటరామమునిరెడ్డి మాట్లాడుతూ భూగర్భజలాల కోసం మీద మీద బోర్లు వేసి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన వైఎస్సార్ జలకళ పథకం సన్న చిన్న కారు రైతులకు వరం లాంటిదన్నారు. రెండేళ్ల కిందట 160 నియోజకవర్గాల్లో ఈ పథకం కింద రెండున్నర ఎకరాల భూమి ఉన్న రైతుల నుంచి 10 ఎకరాలున్న వారికి ఉచితంగా బోర్లు వేయడం మొదలైందన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 179 బోర్లు వేశామని ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 500 బోర్లు మంజూరయ్యాయని వెల్లడించారు. బోర్ల ద్వారా సమృద్ధిగా నీరుందని వరి వంటి పైరులు వేయకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. మోటార్ పంపుసెట్లు మంజూరైన ఆరుగురు రైతులకు ధ్రువపత్రాలను అందజేశారు. డిప్యూటీ కమిషనర్ ఆర్.శశిధర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వీ. సాగర్‌కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, అదనపు పీడీ శివప్రసాద్, ఏపీడీలు శ్రీలక్ష్మి, ఆనంద్, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, ఉపాధి ఏపీఓ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు లింగన్న పాల్గొన్నారు.

- వివాదంలో రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ తరలింపు ప్రక్రియ
- మార్చి చివరి నాటికి పూర్తిస్థాయిలో మూసివేత
- రైల్వే కార్మికుల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకత



నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్

ఎత్తివేత.. వ్యతిరేకత



నందలూరు రైల్వేకు జరుగుతున్న అన్యాయంపై ఎంపీ మిథున్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి తదితరులు (ఫైల్)

నందలూరు(రాజంపేట) : రైల్వేపరంగా బ్రిటిషు రైల్వేపాలకుల హయాంలో వెలుగొందిన నందలూరు రైల్వేకేంద్రంలోని సమగ్ర కంప్యూటరైజ్ క్రూ బుకింగ్ లాబీ(రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్) తరలింపు ప్రక్రియ వివాదస్పదమైంది. తరలింపునకు సంబంధించి ఆదేశాలు జారీ అయ్యాయి. రన్నింగ్‌స్టాఫ్ సిబ్బందికి ఎర్రగుంట్ల-నంద్యాల సెక్షన్‌లో ఎల్ఆర్ఎస్(లర్నింగ్ రోడ్ సెక్షన్) ఇస్తున్నారు. ఇందులో నందలూరు క్రూసెంటర్ పరిధిలో వీరు ఉన్నారు. .

బ్రిటిష్ రైల్వేపాలకుల నుంచి

బ్రిటిష్ రైల్వేపాలకుల నుంచి వేలాది మంది కార్మికులు, ఉద్యోగులతో నందలూరు రైల్వేకేంద్రం కళకళలాడింది.ఇప్పుడు రోజురోజుకు అన్నిశాఖలను ఎత్తివేస్తూ రైల్వేశాఖ నిర్ణయాలు తీసుకుంటోంది. స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఉన్న స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఏర్పాటు కావడంతో అనుబంధంగా రైల్వేకు సంబంధించి అన్ని విభాగాలు ఏర్పడ్డాయి.అప్పట్లో అరకోణం(సదరన్‌రైల్వే) నుంచి గుంతకల్ (ఎస్సీరైల్వే) వరకు నందలూరే రైల్వేపరంగా కీలక కేంద్రంగా కొనసాగింది. లోకోషెడ్ ఎత్తివేయడంతో పాటు అన్ని శాఖలను లేకుండా చేశారు.

రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ తరలింపుపై రైల్వేకార్మికుల్లో వ్యతిరేకత వెల్లుబుకుతోంది.ఎర్రగుంట్లలో పనిచేయడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. నాలుగు లైన్లు ఉండటం, కాలుష్యం సమస్యలను రన్నింగ్‌స్టాఫ్ ఎత్తిచూపుతున్నారు. గతంలో ముద్దనూరులో కూడా ఇదే విధంగా క్రూసెంటర్ పెట్టాలనే ప్రయత్నాన్ని కార్మిక సంఘాలు అడ్డుకున్నాయి. ఇప్పుడూ అదే పరిస్థితులకు దారితీస్తోంది.

మార్చి నెలాఖరులోగా పూర్తిస్థాయిలో క్రూ సెంటర్ తరలింపు పూర్తికావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా ఈనెలాఖరు లోపు నందలూరు క్రూ సెంటర్‌కు సంబంధించిన రన్నింగ్‌స్టాఫ్‌కు ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలన్నారు.దీంతో వారిలో ఆందోళన నెలకొంది.

తరలింపు వద్దంటూ జీఎంను కోరిన ఎంపీ మిథున్‌రెడ్డి

నందలూరు రైల్వేపరంగా ప్రాముఖ్యత కలిగిన కేంద్రమని, ఇక్కడ ఉన్న నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూను ఎత్తివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజరు ఏకేజైన్‌ను రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. నందలూరు. రాజంపేటలో రైళ్లస్టాపింగ్ అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు.ఎంపీ మిథున్‌రెడ్డి ఇటీవల రాజంపేటకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో నందలూరు రైల్వేకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రైల్వేమంత్రిత్వశాఖ, రైల్వేబోర్డును కలిసేందుకు ఎమ్మెల్యే నేతృత్వంలో ఢిల్లీకి రావాలని ఎంపీ తెలిపినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు జనరల్‌సెక్రటరీ సయ్యద్‌అమీర్ తెలిపారు.

రన్నింగ్‌స్టాఫ్ క్రూ తరలిస్తే నందలూరు నిర్మానుష్యమే



నందలూరు రైల్వేకేంద్రానికి గుండెకాయ లాంటిది రన్నింగ్‌స్టాఫ్ క్రూ. క్రూసెంటర్‌ను తరలిస్తే రైల్వేపరంగా నందలూరు నిర్మానుష్యమే. ఇప్పటికే రైల్వే విభాగాలను ఒక్కొక్కటిగా తరలించుకుపోతున్నారు. అడ్డుకట్టవేసేదెవరు అనేది ప్రశ్నార్థకంగా మారింది. మా నాన్న రైల్వే డ్రైవర్, ఆవిధంగా రైల్వేతో తమ జీవితాలు ముడిపడ్డాయి.

– షమీవుల్లాఖాన్, ఏజీపీ, నందలూరు

ప్రాభవం కోల్పోయినట్లే..



రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ తరలిస్తే రైల్వేపరంగా నందలూరు రైల్వేకేంద్రం ప్రాభవం పూర్తిగా కోల్పోయినట్లే. తరలింపు ప్రక్రియను విరమించుకోవడం మంచిది ఎంపీ మిథున్‌రెడ్డి నందలూరు రైల్వే అభివృద్ధికి సంబంధించి అనేక సార్లు ఎంఆర్(మినిష్టర్ ఆఫ్ రైల్వేస్), రైల్వే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు.

– ఆర్ముగం విశ్వనాథ్, ఐకేపీఎస్ నేత, నందలూరు

క్లుప్తంగా

నేత్రదానం



మృతుడి కార్నియాలను అందుకుంటున్న నేత్ర నిధి సంస్థ అధ్యక్షుడు రాజు

పులివెందుల రూరల్ : మృతుడి నేత్రాలను నేత్ర నిధి సంస్థకు అందించారు. పులివెందుల పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో నివసిస్తున్న పెద్ద రంగయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన నేత్రదానానికి కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. నేత్ర నిధి సంస్థ అధ్యక్షుడు రాజు తన సిబ్బందితో కలిసి మృతుడి స్వగృహానికి వెళ్లారు. మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు వయోపరిమితి లేదని.. ఏ వయసులో వారైనా నేత్ర దానం చేయవచ్చునని పేర్కొన్నారు. నేత్ర దానం చేయదల్చుకునే వారు 9966509364, 7093204537 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, నేత్ర నిధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 242 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు సోమవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై మొత్తం 242 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, తదితర వాహనచోదకులుపై 25 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలియజేశారు.

చెకుముకి రాష్ట్ర విజేతలు వీరే

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలను నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. కడప నగరంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో పల్నాడు జిల్లా గణపవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు పి.నాగయశ్విత, వి.కార్తీక్ రెడ్డి, సీహెచ్ సాత్విక ప్రథమ స్థానం సాధించారు. చిత్తూరు జిల్లా గొనుగూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు బి.సౌమ్య, డీఎల్ చైతన్యకుమార్, ఎస్.ప్రణీత ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా కేఎస్ఆర్ఎం హైస్కూలు విద్యార్థులు పి.అబ్బలూమ్, ఎస్.హంసిని, ఎస్.ప్రద్యున్‌రాజ్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో అనంతపురం జిల్లా లక్ష్మి సైనెరజ్ స్కూలు విద్యార్థులు సాయి గణేష్, నవదీప్ గణేష్, సాయి శ్రావణి ప్రథమ స్థానంలో, కాకినాడ ఆదిత్య టాలెంట్ స్కూలుకు చెందిన అశోక్‌స్వామి, శ్రీజన్, ఆదిత్య సాత్విక్ ద్వితీయ స్థానంలో, శ్రీ సత్యసాయిజిల్లా వాల్మీకి హైస్కూలు విద్యార్థులు ఓం.కిరణ్, శ్రీధర్, వజ్రేశ్వర్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ సంబరాల ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మాజీ ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు, కందుల విద్యాసంస్థల అధినేత చంద్ర ఓబుల్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రాహుల్, మురళీధర్, సంస్థ వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, జేవీవీ నాయకులు

ఆదాయ పన్ను చెల్లింపులో మెలకువలు అవసరం



మాట్లాడుతున్న జిల్లా ఖజానాధికారి ఎంఎస్ వెంకటేశ్వర్లు

కడప సిటీ : ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో మెలకువలు పాటించాలని జిల్లా ఖజానాధికారి ఎంఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంలో ఆయా శాఖ డీడీఓలదే పూర్తి బాధ్యత అని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జిల్లా ఖజానాధికారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదాయ పన్ను చెల్లింపులపై ప్రభుత్వ శాఖల డీడీఓలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదాయపు పన్నుశాఖ అధికారి రాజశేఖర్, ఇన్‌చార్జి డీఆర్వో రామ్మోహన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదాయ పన్ను చెల్లింపు వ్యవహారాల్లో డీడీఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఉద్యోగుల ఆదాయపు పన్ను వివరాలను పరిశీలించుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా పన్నుల చెల్లింపు విషయంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిబ్రవరి నెలలో ఈ సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. గతేడాది లాగే ఈ ఏడాది కూడా ఆదాయ పన్ను చెల్లింపుకు సంబంధించి పాత, కొత్త విధానాలు రెండూ అమలులో ఉన్నాయన్నారు. ఉద్యోగులు వ్యక్తిగత ఈ–మెయిల్, మొబైల్ నంబర్లనే ఆదాయ పన్ను చెల్లింపులో నమోదు చేయాలన్నారు. డీడీఓలు అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి ఆదాయ పన్ను శాఖ నిబంధనలకు అనుగుణంగానే పన్ను చెల్లించాలన్నారు. అనంతరం ఉద్యోగులు అడిగిన పలు సందేహాలను ఆదాయపు పన్నుశాఖ అధికారి రాజశేఖర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ అధికారులు, ప్రభుత్వ శాఖల డీడీఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కళాకృతుల పరిశీలన



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో కళాకృతులను పరిశీలిస్తున్న వీసీ ఫజుల్ రెహమాన్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు తీర్చిదిద్దిన కళాకృతుల ప్రదర్శనను వైస్ చాన్సలర్ ఆచార్య ఫజుల్ రెహమాన్ పరిశీలించారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని స్కల్ప్చర్ విభాగంలోని వివిధ రకాల నమూనాలను ఆయన పరిశీలన చేపట్టారు. అనంతరం పలు విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన కళాకృతులను పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన రామసుబ్బయ్య

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసాపేట సర్కిల్‌లో సోమవారం మధ్యాహ్నం లారీ స్కూటీని ఢీకొనడంతో ఆర్ల రామసుబ్బయ్య (62) అనే వృద్ధుడు మృతి చెందాడు. మృతుని కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. కడప నగరం చిలకలబావి సమీపంలో షామియానా అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఆర్ల రామసుబ్బయ్య.. ఉక్కాయపల్లె వద్ద వున్న తమ గోడౌన్ వద్ద వున్న కుమారుడు రమేష్‌కు సోమవారం మధ్యాహ్నం స్కూటీలో వెళ్లి భోజనం క్యారియర్ ఇచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మాసాపేట సర్కిల్‌కు వచ్చేసరికే వెనుకవైపు నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటన జరిగిన వెంటనే వృద్ధుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. మార్గంమధ్యలోనే ఆయన మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ సంజీవరాయుడు తెలియజేశారు.

ఆంగ్లభాషలో నైపుణ్యం ఎంతో అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషలో నైపుణ్యం ఎంతో అవసరం అని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆంగ్లభాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సోమవారం కడప మానస ఇన్ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన రివర్‌సైడ్ లర్నింగ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఇంగ్లిష్ శిక్షణ కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ శిక్షణను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ మాట్లాడటం వంటి వాటిపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఆర్ఎల్‌సీ, ఎస్‌సీఈఆర్టీ నుంచి రిసోర్సుపర్సన్స్‌తో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరువాత అందరి ఉపాధ్యాయులకు శిక్షణను ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదివిన హైదరాబాదు స్కూల్ స్టాండెట్స్ ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను తప్పనిసరి చేశారన్నారు. ఇందుకు అనుగుణంగా ఎస్‌సీఈఆర్టీ వారు నాలుగు నెలల పాటు కసరత్తు చేసి అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించారన్నారు. అనంతరం రివర్‌సైడ్ లర్నింగ్ సెంటర్ రిసోర్సు పర్సన్స్ అర్చన, నందిత, ఎస్సీఈఆర్టీ రిసోర్సుపర్సన్ భానుమతి, పద్మావతి, శైలజ, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్లు ధనలక్ష్మి, రామాంజనేయులు ఆంగ్లం సులభంగా నేర్చుకునే అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల నుంచి 40 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

మట్టి మిద్దె కూలి మహిళ దుర్మరణం



నూర్జహాన్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని నాగలకట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో సోమవారం మట్టి మిద్దె కూలడంతో దిడ్డి నూర్జహాన్ (42) అనే వివాహిత మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగలకట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో చేనేత కుటుంబానికి చెందిన దిడ్డి మహబుబ్‌బాషా భార్య నూర్జహాన్, పిల్లలతో కలిసి కాపురం ఉంటున్నాడు. మధ్యాహ్నం కావడంతో నూర్జహాన్ ఇంటి ఆఖరి రూంలో నిద్రపోయింది. భర్త మగ్గం నేసుకుంటున్నాడు. పాత మిద్దె కావడంతో ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిచూడగా.. అప్పటికే మిద్దె వెనుకవైపు కూలి ఉంది. భార్య నూర్జహాన్ ఉండటం గమనించిన మహబుబ్ బాషా స్థానికుల సాయంతో మట్టిని తీసేందుకు ప్రయత్నం చేశాడు. భార్య కనిపించకపోవడంతో వెంటనే పట్టణ పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన సీఐ సదా శివయ్య, ఎస్‌ఐ సుబ్బారావు, ఆర్‌ఐ జహీర్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీల సాయంతో మట్టిని తొలగించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సంఘటన స్థలానికి వచ్చి కార్యకర్తలు, ప్రజల సహకారంతో ఎట్టకేలకు నూర్జహాన్‌ను బయటకు తీశారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వీరికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. సంఘటన జరిగినప్పుడు వీరు కళాశాలకు వెళ్లి ఉన్నారు.



మృతదేహాన్ని బయటకు తీసుకు వస్తున్న ప్రజలు

గ్రహణ మొర్రి బాధితులను ఆదుకోవడమే లక్ష్యం

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ ముకుందారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : గ్రహణ మొర్రి బాధితులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, బసవ రామ తారక ఇండో అమెరికల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ల వైద్యుడు ముకుందారెడ్డి పేర్కొన్నారు. కడపలోని సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో సమగ్రశిక్ష ఆధ్వర్యాన సోమవారం గ్రహణ మొర్రి బాధితులకు స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి 40 మందికి పైగా గ్రహణమొర్రి బాధితులు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వీరికి ప్రాథమిక పరీక్షల అనంతరం శస్త్ర చికిత్సలు హైదరాబాదులో ఉచితంగా చేయించనున్నట్లు చెప్పారు. ఇందులో పెదవులు సరిచేయుట, పండు అమర్చుట, మాటలలో స్పష్టత కోసం అధునిక వైద్యం అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోషి, సమగ్రశిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి, సెక్టోరియల్ అధికారులు దశరథరామిరెడ్డి, రమణమూర్తి, లక్ష్మి నరసింహారాజు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

జాతీయ స్థాయి పోటీలకు నలుగురు ఎంపిక

కడప స్పోర్ట్స్ : ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 66వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జట్టు విజేతగా నిలవడంలో క్రీడా పాఠశాల విద్యార్థులు కీలకంగా వ్యవహరించారు. బాలుర విభాగంలో కడప జట్టు ప్రథమ స్థానం, బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచాయి. బాలుర జట్టులో ఆరుగురు, బాలికల జట్టులో ఏడుగురు క్రీడా పాఠశాల విద్యార్థులు జట్టులో ఉండటం విశేషం. రాష్ట్ర స్థాయిలో చక్కటి ప్రతిభ కనరబరిచిన క్రీడా పాఠశాల విద్యార్థులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేశారు. బాలికల విభాగం నుంచి కె.మనీష, బాలుర విభాగం నుంచి వై.మణికంఠ, ఎం.భరత్‌కుమార్, ఎస్.ఈరేషలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్, ఫుట్‌బాల్ శిక్షకుడు ఎం.హరి అభినందించారు.

ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదగాలి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న భాగ్యశ్రీ

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదిగేలా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీఈఆర్టీ రాష్ట్ర సైన్సు ఆఫీసర్స్ భాగ్యశ్రీ, మేరీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వైఎస్సార్ జిల్లాలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పనితీరును అంచనా వేయడానికి సోమవారం వారు జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా జిల్లా హబ్‌గా బెస్తవారిపల్లె గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను వారు జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. పాఠశాలల్లోని విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హబ్ ఇన్‌చార్జి సువర్ణకుమార్, పులివెందుల ఎంఈఓ వీరారెడ్డిలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీఎం కప్ క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25, 27, 28 తేదీల్లో ఏపీ సీఎం కప్ జిల్లా స్థాయి టోర్నమెంట్, ఎంపికలు నిర్వహించనున్నట్లు స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు. సీఎం కప్ 2021–22 సంవత్సరానికి సంబంధించి మండల, నియోజక వర్గ స్థాయిలో ఎంపికలను నిర్వహించారని, కావున జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో 14 క్రీడాంశాలలో ఎంపికైన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌కు హాజరు కావాలని కోరారు. ఈ సీఎం కప్ పోటీలు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా (10 నియోజకవర్గాలు) ప్రాతిపదికన క్రీడాకారులు హాజరు కావాలన్నారు. కావున వ్యాయామ ఉపాధ్యాయులు సహకరించి విజవంతం చేయాలని కోరారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
25-1-23	హాకీ	డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియం, కడప
	బ్యాడ్మింటన్	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
	హ్యాండ్‌బాల్	డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియం, కడప
	టేబుల్ టెన్నిస్	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
	బాల్ బ్యాడ్మింటన్	డీఎస్ఏ, అవుట్ డోర్ స్టేడియం, కడప
27-1-23	ఫుట్‌బాల్	డీఎస్ఏ, అవుట్ డోర్ స్టేడియం, కడప
	ఖోఖో	డీఎస్ఏ, అవుట్ డోర్ స్టేడియం, కడప
	టెన్నిస్	డీఎస్ఏ, అవుట్ డోర్ స్టేడియం, కడప
	బాస్కెట్‌బాల్	డీఎస్ఏ, అవుట్ డోర్ స్టేడియం, కడప
	వెయిట్‌లిఫ్టింగ్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
	బాక్సింగ్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
28-01-23	అథ్లెటిక్స్	జెడ్పీ హైస్కూల్, రాయచోటి
	వాలీబాల్	జెడ్పీ హైస్కూల్, రాయచోటి
	కబడ్డీ	జెడ్పీ హైస్కూల్, రాయచోటి

108 వాహనంలో మహిళ ప్రసవం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం బి.జంగాలపల్లె గ్రామానికి చెందిన శిరీషా 108 వాహనంలో సోమవారం ప్రసవం అయింది. 108 సిబ్బంది రమేష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శిరీషాకు పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త కల్యాణ్‌కుమార్ 108 వాహనానికి ఫోన్ చేశారు. వెంటనే వచ్చిన 108 వాహనం ద్వారా జమ్మలమడుగుకు తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలోని మాధపురం గ్రామం వద్ద పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. కుటుంబ సభ్యుల సహకారంతో 108 సిబ్బంది ప్రసవం చేశారు. ఆమె మొదటి సంతానం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత జమ్మలమడుగులోని ఆసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 పైలట్ లతీఫ్ బాషా పాల్గొన్నారు.



బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

మానవత సంస్థకు శాంతి రథం వితరణ

పులివెందుల టౌన్ : డాక్టర్ ఈసీ గంగిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి రూ.7 లక్షల విలువ చేసే శాంతి రథాన్ని వితరణగా అందజేశారు. సోమవారం స్థానిక మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయం వద్ద ఈసీ దినేష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ చేతుల మీదుగా జెండా ఊపి శాంతిరథాన్ని ప్రారంభించారు. సేవ చేయడం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు డీవీ కొండారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మానవత సంస్థకు అందజేసిన శాంతి రథం ప్రారంభిస్తున్న ఈసీ దినేష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

రేపు నారా లోకేష్ రాక

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం జిల్లాకు వస్తారని ఆ పార్టీ శ్రేణులు తెలిపాయి. హైదరాబాద్ నుంచి సాయంత్రం పెద్ద దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం మరియాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తారు. తరువాత తిరుమలకు వెళ్తారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిల్టప్ సర్కిల్ సమీపంలో ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు. ఈ సంఘటనలో నరసింహ, రామాంజి, సుధాకర్‌లను అరెస్ట్ చేశారు. ఓ మహిళను హోంకు పంపించారు.